క్లుప్తంగా

డీఎస్సీలో ఆ ఖాళీలను కలపాలి



తెయూ(డిచ్‌పల్లి): ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ద్వారా ఏర్పడిన ఖాళీలను ప్రస్తుత డీఎస్సీలో జత చేయాలని డీఎస్సీ అభ్యర్థులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు సోమవారం తెలంగాణ యూనివర్సిటీ సెంట్రల్ లైబ్రరి వద్ద ఆందోళన నిర్వహించారు. అనంతరం పలువురు అభ్యర్థులు మాట్లాడుతూ.. ఇటీవల రాష్ట్రంలో చేపట్టిన ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులలో ఏర్పడిన ఖాళీలను జత చేసి మెగా డీఎస్సీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రిపరేషన్‌కు మరింత సమయం కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ విద్యా సంవత్సరం బీఈడీ, డీఈడీ పూర్తి చేసుకుంటున్న అభ్యర్థులకు డీఎస్సీ రాసే అవకాశం కల్పించాలని కోరారు.

స్మారక స్థూపం ఆవిష్కరణకు తరలిరండి



డిచ్‌పల్లి/ఖలీల్‌వాడి: ప్రజాపంథా సిద్ధాంత రూపకర్త డీవీ కృష్ణ స్మారక స్థూపం ఆవిష్కరణ కార్యక్రమానికి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన నగరంలోని కోటగల్లి డివిజన్ కార్యాలయంలో, డిచ్‌పల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వేర్వేరు సమావేశాల్లో మాట్లాడారు. ఈ నెల 26న నిజామాబాద్ జిల్లా కేంద్రంలో డీవీ కృష్ణ స్మారక స్థూపంతో పాటు రెండవ వర్ధంతి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్మికులు, రైతులు అధికసంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు వెంకన్న, మురళి, వాసరి మోహన్, సాయగౌడ్, గంగాధర్, కర్క గణేష్, సాయిబాబా, అషూర్ పాల్గొన్నారు.

పేదల భూములకు పట్టాలివ్వాలి



సిరికొండ: మండల కేంద్రంతో పాటు గడ్కోల్, తూంపల్లి, మైలారం గ్రామాల్లో పేదలు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం పార్టీ ఆధ్వర్యంలో పేదలతో కలిసి మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి, అటవీశాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ భూముల్లో పేదలు సాగు చేసుకుంటున్న భూములకు అడ్డుపడొద్దని ఎఫ్‌ఆర్వో ఎంవీ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు సాయారెడ్డి, రమేష్, దామోదర్, బాబన్న, లింబాద్రి, రమేష్, కిషోర్, బాల్‌రెడ్డి, ఎర్రన్న, సాయిలు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు పరీక్షను రద్దు చేయాలి



నిజామాబాద్‌నాగారం: ఆశా వర్కర్లకు నూతన పరీక్ష విధానం రద్దు చేయాలని లేదంటే పోరాటాలను ఉధృతం చేస్తామని, పారితోషకం లేని బీసీజీ సర్వేను నిలిపివేయాలని సీఐటీయు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం ఆశా వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నాచౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆశ వర్కర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. యూనియన్ ప్రతినిధులు రేణుక, సుకన్య, స్వప్న, దివ్య, విజయ, లలిత, సలీమా, రేణుక రేవతి, చంద్రకళ లలితా లతా పాల్గొన్నారు.

నీట్ నిర్వహణ రాష్ట్రాలకే ఇవ్వాలి



నిజామాబాద్‌అర్బన్: నీట్ పరీక్ష నిర్వహణ రాష్ట్రాలకు ఇవ్వాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం నగరంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌజ్‌లో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రఘురాం, ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ మాట్లాడుతూ.. ఇటీవల కేంద్రం నిర్వహించిన నీట్ పరీక్షలో అవకతవకలు జరిగినా ప్రధాని మోదీ స్పందించకపోవడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి రాష్ట్ర ప్రభుత్వాలు, విద్యార్థులు కోరుతున్నట్లు నీట్ పరీక్షను రాష్ట్రాల పరిధిలోకి మార్చాలని, పేపర్ లీకేజీకి పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. నాయకులు వేణురాజ్, అంజలి, గణేష్, అనిల్, దీపిక, సందీప్, అషూర్ పాల్గొన్నారు.

ఆర్వోబీ పనులకు వరుణుడి అడ్డంకి!

- మాధవనగర్ వంతెన నిర్మాణంలో కానరాని పురోగతి
- ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువు



ఆర్వోబీ ప్రాంతంలో నిలిచిన వర్షపునీరు

నిజామాబాద్ రూరల్: మండల పరిధిలోని మాధవనగర్ రైల్వే గేట్ వద్ద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడి నిధులతో నిర్మిస్తున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు ఇంకా ఆలస్యం కానున్నాయి. నిధులు సకాలంలో విడుదల కాకపోవడం, ప్రస్తుతం వర్షాకాలం కావడం పనులకు అడ్డంకిగా మారుతోందని పలువురు పేర్కొంటున్నారు.

ఇదీ పరిస్థితి..

ఆర్వోబీ పనులు ప్రారంభం అయి దాదాపు రెండు సంవత్సరాలు కావస్తోంది. ఫిల్లర్ పనులు ముగిసి దాదాపు రెండు నెలలు అవుతున్నాయి. ప్రస్తుతం నిధులు మంజూరు కాకపోవడంతో మిగిలిన పనులు ఆగిపోయాయి. ఎలక్షన్ కోడ్ ఉండటంతో నిధులు మంజూరు జాప్యం జరిగిందని అధికారులు చెప్పుకచ్చిన, ప్రస్తుతం ఎన్నికల కోడ్ ముగిసి దాదాపు పదిహేను రోజులు అవుతున్న నిధులు మంజూరు కాలేదు. అసలే నత్తనడకన సాగుతున్న పనులు నిధులు రాకపోవడంతో బ్రిడ్జి పూర్తికావడానికి ఎన్ని సంవత్సరాలు పడుతుందోనని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాధవనగర్ ఆర్వోబీ మిగిలిన పనులకు నిధులు మంజూరైనా ప్రస్తుతం వర్షాకాలంలో పనులు జరిగేనా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వం తీరుతో..

రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడం వల్లే ఆర్వోబీ పనులు ఆలస్యం అవుతుందని ఎంపీ అర్వింద్ గత రెండు రోజుల కిందట పేర్కొన్నారు. ఆయన మాధవనగర్ ఆర్వోబీ పనులను ఇటీవల క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గత నాలుగు నెలలుగా పనులు మొత్తం నిలిచిపోయాయని దీనికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడమే కారణమన్నారు. అదేవిధంగా అర్సపల్లి ఆర్వోబీ పనులు త్వరగతిన కొనసాగుతున్నాయని దాదాపుగా రాష్ట్ర ప్రభుత్వం రూ.15కోట్లకు సంబంధించి నిధులు రావల్సి ఉందని ఎంపీ తెలిపారు.



మాధవనగర్ ఆర్వోబీని పరిశీలిస్తున్న ఎంపీ (ఫైల్)

వాహనదారులకు ఇబ్బందులు..

ఆర్వోబీ పనులు నిలిచిపోవడంతో వర్షాకాలంలో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆర్వోబీ నిర్మాణంలో భాగంగా పలుచోట్ల గుంతలు తవ్వగా వర్షపునీరు అందులో నిలిచి ఉంటుంది. అలాగే రోడ్డు సైతం గుంతలమయంగా మారింది. వర్షాకాలంలో రోడ్డంతా బురదమయంగా మారుతోంది. దీంతో వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. భారీ వర్షాలు కురిస్తే సాయిబాబా ఆలయం వద్ద ఉన్న కల్వర్టు నుంచి వచ్చే నీరు ఆలయం ముందు ఉన్న ఖాళీ స్థలంలోకి వెళ్లి ఆలయంలోకి ప్రవేశించే పరిస్థితి నెలకొంటుంది. ఆర్వోబీ పనులు జరిగే ఎగువ భాగం నుంచి వచ్చే నీరు నేరుగా సాయిబాబా ఆలయం లోపలికి వెళ్లే ప్రమాదం ఉంది. అంతేకాకుడా వర్షం నీరు ఆలయంలోకి వెళ్లకుండా అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆర్వోబీకి నిధులు మంజూరు జరిగేలా చర్యలు తీసుకోవాలని, పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



గుంతల రోడ్డుపై వాహనాల రాకపోకలు

పనులను త్వరగా పూర్తి చేయాలి..



గత రెండేళ్లుగా కొనసాగుతున్న మాధవనగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి. పని ప్రాంతంలో సరైన రోడ్డు మార్గం లేక ప్రస్తుతం వర్షాకాలంలో వాహనదారులు, ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, బ్రిడ్జి పనులు త్వరగా పూర్తి చేయాలి.

–విజయ్, స్థానికుడు

వంతెనల పనులు వేగవంతం చేయాలి

- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి
- పలు మండలాల్లో పర్యటన

సిరికొండ/ధర్పల్లి/ఇందల్వాయి : రూరల్ నియోజకవర్గంలోని పలు మండలాల్లో నిర్మిస్తున్న వంతెనల పనులు వేగవంతం చేయాలని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం నియోజకవర్గంలోని సిరికొండ, ధర్పల్లి, ఇందల్వాయి మండలాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ఈసందర్భంగా సిరికొండ మండలంలోని గడ్కోల్ వద్ద రూ.12 కోట్లతో నిర్మిస్తున్న హైలెవల్ వంతెన నిర్మాణ పనులను పరిశీలించారు. అలాగే ఇందల్వాయి–ధర్పల్లి రోడ్డు మార్గంలో, ధర్పల్లి మండలంలోని వాడి గ్రామం వద్ద వాగుపై నిర్మిస్తున్న హైలెవెల్ వంతెనల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వంతెనలు పూర్తయితే ప్రయాణికుల కష్టాలు తీరుతాయని, లింగాపూర్ వాగు వంతెన పనులు వర్షాకాలం పూర్తవగానే ప్రారంభమవుతాయని అన్నారు. వంతెనల నిర్మాణం నాణ్యతతో, వేగంగా జరిగేలా చూడాలని అధికారులకు సూచించారు. అర్హులైన అన్నదాతలకు మాత్రమే ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందన్నారు. కానీ మల్లారెడ్డి లాంటి బడా వ్యాపారులకు కూడా రుణమాఫీ చేయాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వం నీట్ లాంటి పరీక్ష పేపర్ల లీకేజీతో నిరుద్యోగులకు తీరని అన్యాయం చేసిందని విమర్శించారు. పేపర్ల లీకేజీలపై సీబీఐ విచారణపై మాకు నమ్మకం లేదని, సుప్రీం కోర్టు జడ్జితో విచారణ చేయించాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. అనంతరం పలు బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు. నాయకులు భాస్కర్‌రెడ్డి, ముప్ప గంగారెడ్డి, నవీన్ గౌడ్, వెంకట్‌రెడ్డి, సంతోష్ రెడ్డి, తిరుపతి రెడ్డి, చింతల కిషన్, గోవర్ధన్‌రెడ్డి, రవి, ఎర్రన్న, నరేష్, సాయన్న, రాజారెడ్డి, మల్లేష్‌యాదవ్, లింగారెడ్డి, ఏఈ మనోహర్ పాల్గొన్నారు.



గడ్కోల్ వద్ద వంతెన పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

దాడుల నుంచి కాపాడండి

నిజామాబాద్‌అర్బన్: ప్రయివేటు విద్యాసంస్థలను విద్యార్థి సంఘాల దాడుల నుంచి కాపాడాలని ట్రస్మా నాయకులు కోరారు. ఈమేరకు వారు సోమవారం నగరంలోని సీపీ కార్యాలయంలో పోలీస్ కమిషనర్‌ను కలిసి, వినతిపత్రం అందజేశారు. కమిషనర్ సానుకూలంగా స్పందించి, దాడులు జరిగితే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే, చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని వారు తెలిపారు. అనంతరం ఓ హోటల్‌లో వారు సమావేశం నిర్వహించారు. ట్రస్మా జిల్లా అధ్యక్షుడు నిత్యనందం మాట్లాడుతూ.. విద్యార్థి సంఘాల నాయకులు అనవసరంగా దాడులు చేస్తు భయందోళనకు గురిచేస్తున్నారని అన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారించాలి

సుభాష్‌నగర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వహయాంలో ఇచ్చిన రైతుబంధు నిధుల దుర్వినియోగంపై కాంగ్రెస్ ప్రభుత్వం విచారణ చేపట్టాలని బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అలాగే నిధులను రికవరీ చేయాలని కోరారు.

మెగా డీఎస్సీని వెంటనే ప్రకటించాలి

సుభాష్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వెంటనే మెగా డీఎస్సీ ప్రకటించాలని, గ్రూప్–2, 3 పోస్టులను పెంచాలని నిరుద్యోగులు, విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్‌చేశారు. ఈమేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వారు అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. బీవీఎం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్ బట్టు, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం, విద్యార్థి సంఘాల నాయకులు, నిరుద్యోగులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌కు వచ్చిన విద్యార్థి సంఘాల నాయకులు

రాజపత్రం, పింఛన్, బెనిఫిట్స్ ఇప్పించాలి..

నగరంలోని ఉప్పర్‌టేక్డికి చెందిన మిర్యాల్‌కర్ శ్యామ్‌లాల్ గోవా స్వాతంత్ర్యం కోసం జరిగిన ఉద్యమంలో పాల్గొన్నారని, స్వాతంత్ర్య సమరయోధుడికి ఇచ్చే రాజపత్రంతోపాటు పింఛన్, ప్రభుత్వ బెనిఫిట్స్ అందించాలని ఆయన కుమార్తె ఛోటిబాయి ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఛోటిబాయి మాట్లాడుతూ.. పలుమార్లు అధికారులు వచ్చి విచారణ చేపట్టారని, ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చారన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం నుంచి గుర్తింపు ఇవ్వడం లేదని, వెంటనే అమ్మ పేరుతో రాజపత్రంతో పాటు పింఛన్, బెనిఫిట్స్ ఇప్పించాలని ఛోటిబాయి కోరారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి..

నగరంలోని అర్సపల్లి శివారులోగల రామర్తి చెరువు (ఊర చెరువు) కబ్జాదారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ సయ్యద్ ఖైసర్ డిమాండ్ చేశారు. ఈమేరకు ప్రజావాణిలో ఆయన అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌తోపాటు మున్సిపల్ కమిషనర్ మకరంద్, ఆయాశాఖల అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఖైసర్ మాట్లాడుతూ.. రామర్తి చెరువు సర్వేనెంబర్ 216లో 32 ఎకరాలతో పాటు కట్ట భూమి ఉందన్నారు. ఇప్పటికే దాదాపు 70శాతం భూమి కబ్జాకు గురైందన్నారు. అలాగే మైనారిటీ ఏరియాలో పార్కులు, క్రీడా మైదానాలు, లైబ్రరీ, ఎడ్యుకేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలన్నారు. అధికారులు సానుకూలంగా స్పందించినట్లు ఖైసర్ తెలిపారు. నాయకులు ఏజాజ్, ముషపటేల్ తదితరులు పాల్గొన్నారు.



ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ప్రయివేట్ కాలేజీ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ నాయకులు డిమాండ్‌చేశారు. ఈమేరకు ప్రజావాణిలో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేసే వరకూ విద్యార్థుల నుంచి ఫీజు వసూలు చేసుకునే అవకాశం కల్పించి ఆదుకోవాలని అదనపు కలెక్టర్‌ను కోరారు.

నగరంలో నేటి నుంచి గృహజ్యోతి దరఖాస్తుల స్వీకరణ

నిజామాబాద్‌నాగారం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకం పక్కాగా అమలు చేస్తున్నారు. ఈ పథకం కింద 200 విద్యుత్ యూనిట్లు ఖర్చు చేసే ప్రతి ఇంటికి జీరో బిల్లు అందజేస్తున్నారు. ఈమేరకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. కానీ మున్సిపాలిటీలో దరఖాస్తుల స్వీకరణ కాస్త ఆలస్యమైంది. సోమవారం ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో మంగళవారం నుంచి అన్ని మున్సిపాలిటీల్లి గృహజ్యోతికి దరఖాస్తులు తీసుకోనున్నారు. నిజామాబాద్ మున్సిపాలిటీ పరిధిలో 60 డివిజన్లు ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు 1లక్ష 80వేలకు పైగా విద్యుత్ కనెక్షన్‌లు ఉన్నాయి. నగరంలో చాలామంది అర్హులకు జీరో బిల్లు వస్తుంది. తెల్లరేషన్‌కార్డు ఉండి కూడా 200యూనిట్ల లోపు బిల్లు వచ్చే వినియోగదారులు లబ్ధిపొందకపోతే, వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలి. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పథకానికి బ్రేక్ పడగా.. ప్రస్తుతం మార్చి నుంచి ఇప్పటి వరకు 200యూనిట్లలోపు ఎంత బిల్లు వచ్చిన కట్టాల్సిన అవసరం లేదు. మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన కౌంటర్లలో దరఖాస్తులు, వివరాలు జతచేయగానే జీరో బిల్లు వస్తుంది.

సద్వినియోగం చేసుకోవాలి..

ఎన్నికల కోడ్ రావడంతో గృహజ్యోతి పథకం అమలుకు బ్రేక్ పడింది. 200యూనిట్ల లోపు విద్యుత్‌ఖర్చు చేసే వినియోగదారులు రేషన్‌కార్డు ఉంటే చాలు బిల్లు కట్టాల్సిన అవసరం లేదు. అర్హులు మున్సిపాలిటీ కార్యాలయంలో నేటి నుంచి మళ్లీ దరఖాస్తులు చేసుకోవాలి. కంప్యూటర్‌లో అప్‌డేట్ చేస్తే జీరో బిల్లు వస్తుంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

–రవీందర్, విద్యుత్‌శాఖ ఎస్‌ఈ

సంక్షిప్తం

సిరికొండ వీడీసీ ఎన్నిక

సిరికొండ: సిరికొండ గ్రామాభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా గోరుమంతుల జలంధర్, వైస్ చైర్మన్లుగా ప్రశాంత్‌రెడ్డి, రామలింగం, క్యాషియర్‌గా వినోద్, ప్రధాన కార్యదర్శిగా ఒడ్డెన్న, గంగాధర్, సలహాదారులుగా పెంటయ్య, మోహన్, దాసు, సభ్యులుగా చిన్నగంగారం, రాజగంగారం, లక్ష్మీనర్సయ్య, రాజు ఎన్నికయ్యారు.

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం

సిరికొండ: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ ప్రకటించడంతో సోమవారం మండలంలోని న్యావనంది గ్రామంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే భూపతిరెడ్డి చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. నాయకులు నరేందర్, మహిపాల్, గంగారెడ్డి, ప్రవీన్ పాల్గొన్నారు.

ఆర్మీ జవాన్‌కు సన్మానం

మోపాల్: మండలంలోని కులాస్‌పూర్ తండాకు చెందిన మొట్టమొదటి ఆర్మీ జవాన్ పాత్లోత్ అరవింద్‌ను గ్రామ యువకులు సోమవారం ఘనంగా సన్మానించారు. మాజీ ఉపసర్పంచ్ బాలు నాయక్, మోబి, ప్రకాశ్, చింటూ, అరుణ్, బన్నీ, రామ్, అంబాజీ ఉన్నారు.

నేటి చిత్రం..



జన్మభూమి రోడ్డులో ప్రభుత్వ స్కూల్ పక్కన పేరుకుపోయిన చెత్తాచెదారం

చెత్తను తొలగించండి

నగరంలోని జన్మభూమి రోడ్డు సమీపంలో గల ప్రభుత్వ స్కూల్ పక్కన చెత్తచెదారం పేరుకుపోయింది. దీంతో పరిసరాల్లో దుర్వాసన రావడంతో విద్యార్థులు, కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి చెత్తను ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పిచ్చి మొక్కల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

నిజామాబాద్ రూరల్: మండలంలోని 4వ డివిజన్ పరిధిలోని మాధవనగర్‌లో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పిచ్చిమొక్కలు, వైర్లను అల్లుకున్న తీగలను ట్రాన్స్‌కో అధికారులు తొలగించారు. మాధవనగర్‌లోని స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పిచ్చిమొక్కలు, తీగలతో ప్రమాదం పొంచి ఉందని సోమవారం సాక్షి దినపత్రిలో 'అల్లుకున్న తీగలు–పొంచి ఉన్న ప్రమాదం' అనే కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించారు. స్తంభాలకు అల్లుకును తీగలను, పిచ్చి మొక్కలను తొలగించారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఉన్న పిచ్చిమొక్కలను తొలగించి, పరిసరాలను శుభ్రం చేయించారు.



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పిచ్చిమొక్కలను తొలగించిన దృశ్యం

పండంటి బిడ్డ పరమాత్ముడి వరం



మాట్లాడుతున్న మేయర్ నీతూకిరణ్

నిజామాబాద్‌నాగారం/నిజామాబాద్ రూరల్: పండంటి బిడ్డకు జన్మనివ్వడంతో స్త్రీ పరిపూర్ణ మహిళ అవుతుందని, స్త్రీ బిడ్డను కనడం పరమాత్ముడు ఇచ్చిన వరమని మేయర్ నీతూకిరణ్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని గంగాస్థాన్ రామకృష్ణ సేవ సమితి ఆధ్వర్యంలో సోమవారం గర్భిణులకు శిక్షణా శిబిరం 'ఆర్య జనని' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి మేయర్ ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. ఆర్యజనని పేరుతో హైదరాబాద్ రామకృష్ణ మఠం ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో గర్భిణులకు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. స్త్రీ వైద్యనిపుణురాలు అనుపమారెడ్డి మాట్లాడుతూ.. ఆర్యజనని గర్భిణుల కోసం ప్రతి నెల మొదటి శనివారం తెలుగులోనూ, 2వ, 4వ శనివారాలలో ఆన్‌లైన్ శిక్షణ శిబిరం ఆంగ్ల భాషలో ఉంటుందని, తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గర్భిణులకు యోగాసనాలపై గురువు అనంత లక్ష్మీ అవగాహన కల్పించారు. జిల్లా శిశుసంక్షేమశాఖ అధికారి రసూల్‌బి సూపర్‌వైజర్ నందిని, నిహారిక, సముద్రాల మాధురి, దశరథ్, నారాయణ రావు, సాయి ప్రసాద్, ప్రకాష్‌గౌడ్, శ్రీనివాస చారి, మధుసూదనాచారి తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

రీఅడ్మిషన్‌కు అవకాశం

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆగస్టు 14వరకు రీ అడ్మిషన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ రామ్మోహన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ మూడు, ఐదవ సెమిస్టర్‌లో రీ అడ్మిషన్‌కు అవకాశం ఉందన్నారు. మూడు, ఐదవ సెమిస్టర్ పూర్తి చేయకుండ తదుపరి సెమిస్టర్ కోసం డిస్‌కంటిన్యూ చేసిన వారు అర్హులన్నారు.

నేడు మెంట్రాజ్‌పల్లిలో 'రైతు నేస్తం'

డిచ్‌పల్లి: మండలంలోని మెంట్రాజ్‌పల్లి రైతువేదికలో మంగళవారం 'రైతు నేస్తం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయాధికారి రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని రైతు భరోసా అంశంపై నేరుగా రైతులతో చర్చిస్తారని తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో మండలంలోని రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్సడ్	200
	(కిలోకు)	లైవ్	180
స్కిన్‌లెస్	240	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	72,700	వెండి (కిలో)	92,000
22 క్యారెట్స్	67,062	– నిజామాబాద్ బిజినెస్	

704 : ఫొటో

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	48	75	గాజరుగడ్డ	35	50
బెండకాయ	40	60	పచ్చిమిర్చి	60	100
బీరకాయ	60	80	దోసకాయ	20	40
దొండకాయ	40	60	ఆలుగడ్డ	30	50
బీర్నిసుకాయ	80	100	గోబిగడ్డ	25	50
కాకరకాయ	60	90	గోబిపువ్వు	25	50
వంకాయ	25	50	బీట్‌రూట్	30	60
పాలకూర	30	50	కరివేపాకు	40	70
మెంతికూర	30	50	చామగడ్డ	40	60
కొత్తిమీర	60	80	గోరుచిక్కుడు	50	75
పుదీనా	50	80	చిక్కుడుకాయ	70	100
క్యాప్సికం	50	80			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	మహారాజ(తెలుగు)- 1.45, 4.40, 7.35, 10.3
స్క్రీన్-2	ఓమైగాడ్(తెలుగు) - 11.10,4.35 ప్రభుత్వ జూనియర్ కళాశాల (తెలుగు)-1.40 నింద (తెలుగు) - 7.30, 10.25
స్క్రీన్-3	మనమే (తెలుగు)- 1.35, 4.40, 10.30 సందేశం (తెలుగు) - 7.40

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	మహారాజ(తెలుగు)-11.05, 4.30, 7.35, 10.40-మరణం(తెలుగు)-2.10
స్క్రీన్-2	ఇన్‌సైడ్ అవుట్-2(3డీ ఇంగ్లీష్)-11.30 5.05, ఏ (తెలుగు)-1.50 జహంగీర్ నేషనల్ యూనివర్సిటీ (హిందీ)- 7.25 ముంజ్య(హిందీ)- 10.35
స్క్రీన్-3	ఓ మైగాడ్(తెలుగు) - 11.15, 7.55 హనీమూన్ ఎక్స్‌ప్రెస్ (తెలుగు) - 2.00 హరోంహర (తెలుగు) - 4.40 చందు చాంపియన్ (హిందీ) - 10.40
స్క్రీన్ -4	ఇట్లు మీ సినిమా (తెలుగు) - 11.45 నింద(తెలుగు)-2.20,7.50 ప్రభుత్వ జూనియర్ కళాశాల (తెలుగు)-5.00 మనమే(తెలుగు)-10.30
దేవి	మహారాజా (తెలుగు)
నటరాజ్	చందు చాంపియన్ (హిందీ)
విజయ్	నింద (తెలుగు)